నేడు కొత్త ఉపాధ్యాయుల రాక



ఉపాధ్యాయురాలికి పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి, చిత్రంలో అదనపు కలెక్టర్ మోహన్‌రావు, జడ్పీ సీఈవో వెంకట్‌రెడ్డి, డీఈవో రవీందర్ తదితరులు

- జిల్లాలోని పాఠశాలల్లో 196 ఖాళీల భర్తీ
- గందరగోళంగా కౌన్సెలింగ్ ప్రక్రియ

న్యూస్‌టుడే, పాలమూరు : జిల్లాలో ఖాళీలు ఉన్న ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలకు బుధవారం కొత్త ఉపాధ్యాయులు రానున్నారు. డీఎస్సీ - 2024 ద్వారా 243 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వివిధ కారణాలతో 196 పోస్టులనే జిల్లా విద్యాశాఖ అధికారులు భర్తీ చేస్తున్నారు. ఒక్కో పోస్టుకు ఒక్కో ఖాళీని మాత్రమే అంతర్జాలంలో చూపారు. మహబూబ్‌నగర్ ఐడీవోసీ కార్యాలయం(కలెక్టరేట్)లో మంగళవారం సాయంత్రం కౌన్సెలింగ్ ప్రక్రియను కలెక్టర్ విజయేందిర బోయి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి, డీఈవో రవీందర్ తదితరులు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి పోస్టులు కేటాయించారు.

ఫోన్లు చేసి రప్పించారు..

మహబూబ్‌నగర్‌లో మంగళవారం ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని విద్యాశాఖ అధికారులు అభ్యర్థులకు సమాచారం అందించారు. అభ్యర్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఉదయమే కలెక్టరేట్‌కు చేరుకోగా అనివార్య కారణాల వల్ల కౌన్సెలింగ్ ప్రక్రియ వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అనంతరం వారి నుంచి పేర్లు సేకరించిన అధికారులు ఇళ్లకు వెళ్లిపోవాలని సూచించారు. అభ్యర్థులు నిరాశతో వెనుదిరిగారు. సమాచారం అందుకున్న పాఠశాల విద్యా శాఖ జేడీ మదన్ మోహన్ కలెక్టరేట్‌కు వచ్చారు. డీఈవోతో మాట్లాడి కౌన్సెలింగ్ నిలిపేయడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. పలు జిల్లాల్లో ఖాళీల ఎంపికలు పూర్తి కాకపోవడంతో రాష్ట్ర అధికారుల సూచన మేరకు వాయిదా వేశామని తెలిపారు. తర్వాత కొంతసేపటికి మధ్యాహ్నం 1.30 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు అభ్యర్థులకు సమాచారం అందించి వెంటనే వెనక్కి రప్పించాలని డీఈవో సంబంధిత ఎంఈవోలు, పరిశీలనా కమిటీల జీహెచ్‌ఎంలను ఆదేశించారు. వారు ఫోన్ చేసి చెప్పటంతో అభ్యర్థులు ఆదరా బాదరాగా తిరిగి వచ్చారు.

ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరం..

కౌన్సెలింగ్ వద్దకు రావడానికి సంఘాల నాయకులకు అనుమతి లేదని డీఈవో రవీందర్ ప్రకటించటంతో నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతర్జాలంలో కాకుండా, మ్యానువల్‌గా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించిన ప్రతీసారి సంఘాల నాయకులకు వచ్చే అవకాశం ఉంటుందని పీఆర్టీయూ టీఎస్, యూటీఎఫ్, డీటీఎఫ్, తపస్ సంఘాల నాయకులు మదన్ మోహన్, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, సునిల్, గోపాల్ నాయక్ తదితరులు డీఈవోతో వాగ్వాదానికి దిగారు. తర్వాత డీఈవో అనుమతించారు.

నిరీక్షణలో బదిలీ ఉపాధ్యాయులు..

ఈ ఏడాది జులైలో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రభుత్వం నిర్వహించింది. అందులో పలువురు ఉపాధ్యాయులు అంతర్జాలం ద్వారా నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియ పాల్గొని ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. వారి స్థానంలో వేరే వారు రాకపోవడంతో బదిలీ అయిన పాఠశాలలోనే చేరలేకపోయారు. జిల్లా వ్యాప్తంగా 400 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు కొత్త వారి రాక కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రక్రియలో 196 మందికి అవకాశం కల్పించడంతో ఇంకా సగం మంది పాత ఉపాధ్యాయులు రిలీవ్ కాని పరిస్థితి నెలకొంది. 2008 డీఎస్సీ ద్వారా తాత్కాలిక పద్ధతిలో భర్తీ అయ్యే ఉపాధ్యాయులతో మరి కొందరు బదిలీ ఉపాధ్యాయులు కొత్త పాఠశాలలకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి.



కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

జూరాల.. విద్యుదుత్పత్తి లక్ష్యం నెరవేరేలా!

ఆత్మకూరు, న్యూస్‌టుడే : జూరాల జలాశయం వద్ద వరద నీటి లభ్యత విద్యుదుత్పత్తికి అనుకూలిస్తోంది. ఈ ఏడాది ఆశించిన మేరకు వరద ప్రవాహం కొనసాగుతున్న క్రమంలో గరిష్ఠ స్థాయిలో ఉత్పత్తికి జెన్‌కో సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది ఆశించిన మేరకు లక్ష్యం నెరవేరలేదు. ప్రాజెక్టుకు ఈ ఏడాది జులై 16వ తేదీ నుంచి వరద రాక ప్రారంభమైంది. ఆ మరుసటి రోజు నుంచే ఉత్పత్తికి చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 500 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి పూర్తి అయ్యింది. నిర్దేశించిన లక్ష్యం చేరుకునేందుకు శ్రమిస్తున్నారు.

- గత ఏడాది ఎగువన 330, దిగువ కేంద్రంలో 290 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించారు. వరద నీరు అందుబాటులో లేకపోవడంతో రెండు కేంద్రాల్లోనూ ఉత్పత్తి రెండు వందల మిలియన్ యూనిట్లకు చేరుకోలేదు. ఈ ఏడాది సైతం గత ఏడాది స్థాయిలోనే లక్ష్యం విధించారు. ఇప్పటికే ఎగువన 261.142, దిగువన 239.458 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. జలాశయానికి ఎగువన కర్ణాటక నుంచి వరద నీటి విడుదల వచ్చే నెల మూడో వారం వరకు కొనసాగనున్న పరిస్థితుల్లో నిర్దేశించిన మేరకు ఉత్పత్తి సాధించేందుకు జెన్‌కో సిబ్బంది రేయింబవళ్లు విధుల్లో కొనసాగుతున్నారు.

జూరాలకు వరద రాక : జులై 16 నుంచి
ఇప్పటికే విద్యుదుత్పత్తి : 500 మిలియన్ యూనిట్లు
ఒక్కో యూనిట్‌తో ఆదాయం : రూ.1.16 కోట్లు
మూడో యూనిట్ మరమ్మతులతో నష్టం : రూ.4.16 కోట్లు




దిగువ జూరాల విద్యుదుత్పత్తి కేంద్రం

రూ.50 కోట్లకు పైగా ఆదాయం : ఎగువన ఐదు, దిగువన ఆరు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి జరుగుతోంది. ఈ ఏడాది రెండు కేంద్రాల ద్వారా జెన్‌కో సంస్థకు దాదాపు రూ.50 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ప్రాజెక్టు వద్ద వరదనీటి ఉద్ధృతి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా కొనసాగిన రోజుల్లో ఉత్పత్తి తగ్గుతోంది. ప్రాజెక్టు గేట్ల ద్వారా నదిలోకి విడుదలయ్యే వరదనీటి ఉద్ధృతి పెరిగిన సందర్భాల్లో ఉత్పత్తి అనంతరం వెలువడే నీరు కృష్ణానదిలోకి చేరడం సమస్యగా మారుతోంది. నదిలో ప్రవహించే నీటికి కేంద్రాల నుంచి విడుదలయ్యే నీటికి మధ్య ఎత్తు తగ్గడంతో ఉత్పత్తిపై ప్రభావం చూపుతోంది. అయినప్పటికీ నీటిని నియంత్రించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో యూనిట్ ద్వారా రూ.1.16 కోట్లు ఆదాయం సమకూరే విద్యుదుత్పత్తి జరిగింది.

మూడేళ్లుగా పూర్తికాని మరమ్మతులు : ఎగువ కేంద్రంలోని మూడో యూనిట్‌లో మూడేళ్ల క్రితం సాంకేతిక సమస్య ఏర్పడింది. ఏటా ఉత్పత్తి నష్టపోవాల్సి వస్తోంది. ఈ ఏడాది ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల సంస్థకు రూ.4.16 కోట్ల నష్టం వాటిల్లింది. మరమ్మతులకు బాధ్యత వహించాల్సిన సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

లక్ష్యం నెరవేరుస్తాం



ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు విద్యుదుత్పత్తి చేస్తామని నమ్మకం ఉంది. వరదనీటి విడుదల మరో నెల రోజుల పాటు కొనసాగనుందని ఆశిస్తున్నాం. ఎగువ కేంద్రంలోని మూడో యూనిట్ మరమ్మతులు వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 11 యూనిట్ల ద్వారా గరిష్ఠ ఉత్పత్తికి బాధ్యత వహిస్తున్నాం.

-సూరిబాబు, ఎస్ఈ, (ఓఅండ్ఎం) టీఎస్ జెన్‌కో

స్వయంఉపాధి యూనిట్ల నిర్వహణ భేష్ : కలెక్టర్



నవాబ్‌పేటలో సీతాఫలాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : గ్రామాల్లో మహిళా సంఘాలు చేపట్టిన స్వయంఉపాధి యూనిట్ల నిర్వహణ బాగుందని కలెక్టర్ విజయేందిర బోయి అభినందించారు. మంగళవారం ఎన్మనగండ్ల, లింగంపల్లి గ్రామాల్లో నాటుకోళ్ల పెంపకం, నవాబ్‌పేటలోని మహిళా సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సీతాఫలాల ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణను పరిశీలించారు. మహిళా సంఘం సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి 'మనఊరు - మనబడి' అభివృద్ధి పనులను పరిశీలించారు. మరుగుదొడ్డి నిర్మాణం కోసం ఉపాధి హామీ కింద రూ.2లక్షలు మంజూరైనట్లు చెప్పడంతో పనులను ప్రారంభించామని, తర్వాత నిధులు లేవని చెప్పడంతో నిలిపివేసినట్లు నిర్వాహకుడు నర్సింహులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. డీఆర్డీవో నర్సింహులు, ఏపీడీ జోజప్ప, డీపీఎం నాగమల్లిక, ఎంపీడీవో జయరాం నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీవో బద్రూనాయక్, ఏపీఎం జీవరత్నం, మహిళా సంఘం అధ్యక్షురాలు బాలమణి, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ : డీఎస్సీ-2024లో ఉపాధ్యాయులుగా ఎంపికైనవాళ్లు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కొత్త ఉపాధ్యాయులకు కేటాయించిన పోస్టింగ్ ఉత్తర్వులు అందజేసి మాట్లాడారు. దేశ భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో ఉందన్నారు. కోరుకున్న చోట పోస్టింగ్ వచ్చినా రాకపోయినా బాధ్యతగా పనిచేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, జడ్పీ సీఈవో వెంకట్ రెడ్డి, డీఈవో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు పెరిగిన వరద

ధరూరు న్యూస్‌టుడే: జూరాల జలాశయంలోకి వరద పెరిగింది. దీంతో గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. 60వేల క్యూసెక్కుల వరద జలాశయంలోకి చేరుతోంది. జలవిద్యుదుత్పత్తి ద్వారా 38వేల క్యూసెక్కులు, మూడు గేట్లు ఎత్తి 21 వేల క్యూసెక్కులు మొత్తం 59 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. కర్ణాటకలోని ఆలమట్టి జలాశయంలోకి 21వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా దిగువకు 18వేల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణ్‌పూర్ జలాశయంలోకి 48వేల క్యూసెక్కుల వరద చేరుతోంది. దిగువకు 45వేల క్యూసెక్కులు వదులుతున్నారు.

ఖాళీలతో పట్టణ ప్రణాళిక కుదేలు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలు



భూత్పూర్ పురపాలిక

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : పురపాలికల్లో రెవెన్యూ తర్వాత అత్యంత కీలకమైన ప్రణాళిక విభాగాలు ఖాళీలతో కునారిల్లుతున్నాయి. సరైన యంత్రాంగం, పర్యవేక్షణ లేక పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు పుట్టగొడుగుల్లా వెలుస్తూ అనేక సమస్యలకు కారణమవుతున్నాయి. పురపాలికల్లో ఇంజినీర్ల నియామకం చేపట్టిన గత ప్రభుత్వం ముఖ్యమైన ప్రణాళిక విభాగాన్ని పట్టించుకోలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఒక ప్రత్యేక గ్రేడు పురపాలిక, 9 రెండో శ్రేణి పురపాలికలు, మరో 9 మూడో శ్రేణి పురపాలికలు ఉన్నాయి. వీటి పరిధిలో కీలకమైన చాలా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 57 మంది టీపీబీవోలు పనిచేయాల్సి ఉండగా ఒక్కరు కూడా లేరు. ఇక పురపాలికకు కనీసం ఒకరు ఉండాల్సిన ట్రేసర్ పోస్టులు మొత్తం ఖాళీగానే ఉన్నాయి. ప్రణాళిక విభాగాల్లో సరైన సిబ్బంది లేని కారణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన కుంటుపడి ఎక్కడికక్కడ అనుమతులు లేని నిర్మాణాలు వెలుస్తున్నాయి.

కీలక స్థానాల్లో ఇన్‌ఛార్జులు.. : ప్రణాళిక విభాగాల్లో ఏసీపీ (అసిస్టెంట్ సిటీ ప్లానర్) తర్వాత టీపీవో (టౌన్ ప్లానింగ్ అధికారి), టీపీఎస్ (టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్), టీపీబీవో (టౌన్ ప్లాన్ బిల్డింగ్ అధికారి), ట్రేసర్ పోస్టులు కీలకం. ప్రత్యేక గ్రేడు పురపాలిక మహబూబ్‌నగర్‌కు రెండు ఏసీపీ పోస్టులు మంజూరు ఉండగా ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. మూడు టీపీబీవో పోస్టులకు గాను అన్నీ ఖాళీగా ఉన్నాయి. ఒక ట్రేసర్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. సెకండ్ గ్రేడ్ పురపాలికలైన నారాయణపేట, వనపర్తి, గద్వాల, అయిజ, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, జడ్చర్లలో టీపీవో పోస్టులకు అనుగుణంగా ఒక్కో టీపీవో పనిచేస్తున్నారు. అచ్చంపేట, కొల్లాపూర్ పురాల్లో టీపీవో పోస్టులు ఉన్నా భర్తీ చేయలేదు. టీపీవోలు లేకపోవడంతో పక్క పురపాలికల టీపీవోలు ఇన్‌ఛార్జులుగా వారంలో రెండు రోజులు విధులు నిర్వహిస్తున్నారు. టీపీబీవోలు పదేళ్లుగా ఖాళీగానే ఉంటున్నాయి. ట్రేసర్ పోస్టులు ఎక్కడా లేవు.

కొత్త పురాలు గాలికి.. : కొత్తగా ఏర్పాటైన పెబ్బేరు, కొత్తకోట, అమరచింత, కోస్గి, భూత్పూర్, మక్తల్, ఆత్మకూర్, వడ్డేపల్లి, అలంపూర్ పురపాలికల ప్రణాళిక విభాగాలను గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసింది. వాటికి ప్యాట్రన్ ప్రకారం ఒక టీపీవో, రెండు టీపీఎస్, మరో రెండు లేక మూడు టీపీబీవో, ఒక ట్రేసర్ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాల్సి ఉండగా ఆ ఊసేలేదు. ఈ పురపాలికల్లో నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ పురపాలికల టీపీవోలు, టీపీఎస్‌లు వారంలో రెండు రోజులు పనిచేస్తూ నెట్టుకొస్తున్నారు.

హోదా	పోస్టులు	ఉన్నవారు
ఏసీపీ	02	01
టీపీవో	19	19
టీపీఎస్	27	12
టీపీబీవో	57	0
ట్రేసర్	19	0

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు : ఎస్పీ



భూత్పూర్ పరిధిలో జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎస్పీ జానకి

భూత్పూర్, బాలానగర్, న్యూస్‌టుడే : జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ జానకి సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని బాలానగర్ నుంచి అడ్డాకుల వరకు జాతీయ రహదారి-44ని ఆమె పోలీసులు, జాతీయ రహదారుల నిర్వహణ సంస్థ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. భూత్పూర్ పరిధిలోని దివిటిపల్లి పైవంతెన, భూత్పూర్ ఠాణా, పోతులమడుగు, తాటికొండ స్టేజీ వద్ద పరిశీలించి, ఎక్కువగా ప్రమాదాలు జరగడానికి గల కారణాలపై ఆరాతీశారు. బ్లాక్ స్పాట్ల వద్ద వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అతివేగంగా వెళ్లే వాహనాలను సీసీ కెమెరాలతో గుర్తించి జరిమానాలు విధించాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైనా కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్బీ డీఎస్పీ రమణారెడ్డి, సీఐలు నాగార్జున, ఆదిరెడ్డి, ఎస్సైలు చంద్రశేఖర్, తిరుపాజీ పాల్గొన్నారు.


నేటి నుంచి బాదేపల్లి మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభిస్తున్నట్టు మార్కెట్ అధ్యక్షురాలు తంగెళ్ల జ్యోతి ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు పాత మార్కెట్ ఆవరణలో పూజ కార్యక్రమాలతో కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పాలమూరు : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 2024 -25 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఐఈవో కౌసర్ జహాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృక్షశాస్త్రం సబ్జెక్ట్ ఖాళీ ఉందని, పీజీలో 50శాతం మార్కులు కలిగినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీహెచ్‌డబ్ల్యూ సబ్జెక్ట్ ఖాళీకి బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 17వ తేదీ వరకు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

వైద్యో నారాయణ.. మీకిది తగునా..!



- ఓ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యుల్లో సగం మందికి ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. ఆ దవాఖానాల్లోనే చికిత్స పేరుతో కన్సల్టెంట్ వైద్యులుగా బోర్డులపై పేర్లు రాయించుకుని వైద్యం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రికొచ్చే పలువురు రోగులను తమ ప్రైవేటు నర్సింగ్‌హోంలకు వచ్చేలా ఒత్తిడి తీసుకొస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- ఓ జిల్లాలో సూపరింటెండెంట్ స్థాయి హోదా ఉన్న వైద్యాధికారికి బినామీ పేర్లతో పలు ప్రాంతాల్లో మూడు ప్రైవేటు నర్సింగ్ హోంలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రికొచ్చిన ఓ రోగిని చికిత్స పేరుతో ఆరు నెలలుగా తన ప్రైవేటు ఆస్పత్రికి రప్పించుకుని రూ.1.50 లక్షలు ఖర్చు చేయించారు. మొదట కడుపునొప్పి అని శస్త్రచికిత్స చేయించారు. వ్యాధి నయం కాకపోవడంతో ఏకంగా గర్భ సంచినే తీసేశారు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో బాధితురాలు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు.

ఈనాడు, మహబూబ్‌నగర్: ఉమ్మడి జిల్లాలో ఐదు జనరల్ ఆస్పత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, 89 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జనరల్ ఆస్పత్రులు, సీహెచ్‌సీలు, డీఎంహెచ్‌వో కార్యాలయాల్లో పని చేసే కొందరు వైద్యుల పనితీరుపై తీవ్ర విమర్శలొస్తున్నాయి. కొందరు వైద్యులు సర్కారు దవాఖానాల్లో నిస్వార్థంగా రోగులకు సేవలందిస్తూ మంచిపేరు సంపాదించుకుంటుండగా మరికొందరు వ్యాపారమే లక్ష్యంగా పని చేస్తున్నారనే వాదనలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రభుత్వాస్పత్రుల్లో ఉద్యోగాలు చేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించకుండా తమ ప్రైవేటు ఆస్పత్రులకు రప్పించుకుంటున్నారు. సాధారణంగా వైద్యులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రుల్లో విధులు నిర్వహించాలి. జనరల్ ఆస్పత్రుల్లో పని చేసే వైద్యులు మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తే తర్వాత మరో రెండు గంటల వైద్య కళాశాలలో తరగతులకు హాజరు కావాలి. ఆర్ఎంవోలు మూడు షిఫ్టుల్లో పని చేయాలి. పలు ఆస్పత్రుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు పని చేసి విధుల నుంచి బయటకొస్తున్నారు. తర్వాత తమ ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చి ఓపీ విభాగాలు చూడటం, ఇతర శస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

హైదరాబాద్‌కు పంపించాల్సి ఉన్నా.. : జనరల్ లేదా ప్రాంతీయ ఆస్పత్రులకు రోగులు వచ్చినప్పుడు అక్కడ చికిత్స అందించే మార్గాలు లేకుంటే వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి లేదా ఉస్మానియా ఆస్పత్రికి రిఫర్ చేయాలి. ఉమ్మడి జిల్లాలో అలా జరగడం లేదు. ప్రభుత్వ వైద్యులు తాము ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు నర్సింగ్‌హోంలకు రావాలని చెబుతున్నారు. శస్త్ర చికిత్సల పేరుతో రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయాలు, జనరల్ ఆస్పత్రుల్లో పని చేస్తున్న కొందరు గైనకాలజిస్టులు కాన్పుల కోసం వచ్చే వారిని ప్రైవేటుకు మళ్లిస్తూ శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. గతంలో వైద్యం వికటించడంతో ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పలు సంఘటనలు వివాదాస్పదమయ్యాయి. అయినా పలువురు వైద్యుల్లో మార్పు రావడం లేదు.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు తమకు కేటాయించిన సమయంలో తప్పనిసరిగా విధులు నిర్వహించాల్సిందే. ఆ సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకెళ్లి చికిత్స చేయడం నిబంధనలకు విరుద్ధం. సర్కారు దవాఖానాలకొచ్చిన రోగులను ప్రైవేటు క్లినిక్‌లకు పంపించకూడదు. అత్యవసరం అనుకుంటే హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా వంటి ఆస్పత్రులకు రిఫర్ చేయాలి.

-సంపత్‌కుమార్‌సింగ్, పర్యవేక్షకులు, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి

ఆర్పీల దారుణాలు

- రూ.కోట్లల్లో అక్రమాలు
- పర్యవేక్షణ చేయని సీవోలు



కోయనగర్ సమాఖ్యలో ఆర్పీ దుర్వినియోగం చేసిన సొమ్ముపై తుది నివేదిక తయారు చేస్తున్న మెప్మా సిబ్బంది

న్యూస్‌టుడే, పాలమూరు పురపాలకం : మహబూబ్‌నగర్‌లో పొదుపు సంఘాల లెక్కాపద్దులు చూసే రిసోర్స్ పర్సన్ల(ఆర్పీలు) అక్రమాల కారణంగా మెప్మా ప్రతిష్ఠ మసకబారుతోంది. పొదుపు పద్దులను పారదర్శకంగా నిర్వహిస్తూ స్వయం సహాయక సంఘాలను స్వావలంబన దిశగా నడిపించాల్సిన ఆర్పీలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ నిలువునా ముంచేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లోని కోయనగర్ సమాఖ్యలోనే ఆర్పీ రూ.1.49 కోట్ల సొమ్ము పక్కదారి పట్టించారంటే మహిళా సంఘాలపై పర్యవేక్షణను అర్థం చేసుకోవచ్చు. గతంలో పట్టణంలోని పలు సమాఖ్యల్లో కొందరు ఆర్పీలు సంఘాల పొదుపు డబ్బు, స్త్రీనిధి రుణాల వాయిదాల సొమ్ము పెద్ద మొత్తంగా కాజేసి అడ్డంగా దొరికిపోయారు. మరికొందరు ఆర్పీలు వ్యవహారం బయటకు పొక్కే సమయానికి సమాఖ్యల్లోని సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల కాళ్లావేళ్లా పడి గుట్టుగా సర్దుబాటు చేసుకున్నారు. ఆర్పీలు ఈ స్థాయిలో పొదుపు ఖాతాలు, రుణాల సొమ్మును పథకం ప్రకారం పక్కదారి పట్టిస్తుంటే సమాఖ్యలను పర్యవేక్షించాల్సిన సీవోలు(కమ్యూనిటీ ఆర్గనైజర్లు) పట్టనట్లు వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది. తమకు తెలియకుండా, తమ ప్రమేయం లేకుండా ఆర్పీలు అక్రమాలకు పాల్పడ్డారని ఒక్క మాటలో బదులిచ్చి సీవోలు తప్పించుకుంటున్నారు. కోయనగర్ సమాఖ్యలో ఆర్పీ మూడేళ్లుగా అక్రమాలకు పాల్పడుతున్నా పర్యవేక్షించాల్సిన సీవో తనకు తెలియదని తప్పించుకోవడాన్ని ఎలా అర్థం చేసుకుంటారో మెప్మా, పురపాలక అధికారులే తెలియాలి.

పురపాలికలోని ఓ విలీన గ్రామ సమాఖ్య ఆర్పీ రూ.50 లక్షలకు పైగా సంఘాల సొమ్ము దుర్వినియోగం చేయగా ఆమెను మహిళలు, గ్రామస్థులు చితకబాదారని సమాచారం. వ్యవహారం బయటకు పొక్కకుండా సీవో స్థానిక కౌన్సిలర్ సహాయంతో దుర్వినియోగమైన సొమ్ము చెల్లించేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరో విలీన గ్రామ సమాఖ్యలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఖాతాల్లో ఎంత పొదుపు సొమ్ము ఉందని అడిగినా ఆర్పీ, సీవో చెప్పటం లేదని ఆ సమాఖ్యకు చెందిన ఓ మహిళ 'న్యూస్‌టుడే'తో వాపోయారు.

ఠాణాలో ఫిర్యాదు చేసినా.. : పట్టణంలోని ఓ సమాఖ్యలో ఆర్పీ రూ.8 లక్షల మేర స్త్రీనిధి రుణాలను దుర్వినియోగం చేసినట్లు మహిళలు లబోదిబోమన్నారు. ఈ వ్యవహారంపై స్త్రీనిధి బ్యాంకు అధికారులే స్వయంగా పోలీస్‌స్టేషన్ వెళ్లి ఆర్పీపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇంతవరకు ఆర్పీ నుంచి డబ్బు రికవరీ జరగకపోగా ఆమెపై చర్యలు కూడా తీసుకోలేదు. ఈ అక్రమాన్ని సీవో గుర్తించకపోవడం గమనార్హం. మర్లులో అక్రమాలకు పాల్పడిన ఆర్పీ నుంచి సొమ్ము రికవరీ చేయలేదు. ఆమెను తొలగించి కొత్త ఆర్పీని ఏర్పాటు చేసి చేతులు దులుపేసుకున్నారు. పాల్‌సాబ్‌గుట్టలో మూడేళ్ల క్రితం ఓ ఆర్పీ పెద్ద మొత్తంలో పొదుపు సొమ్ము, రుణాల వాయిదా డబ్బులు కాజేసి ఏకంగా టికానా ఎత్తేయటంతో మహిళలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. షాసాబ్‌గుట్ట సమాఖ్యకు చెందిన మరో ఆర్పీపైనా స్త్రీనిధి రుణాల దుర్వినియోగం ఆరోపణలు వచ్చాయి. విచారణ దశలోనే దుర్వినియోగం చేసిన డబ్బు చెల్లిస్తానంటూ లేఖ రాసి విధుల నుంచి తప్పుకొన్నారు. ఇటీవల టీడీగుట్ట సమాఖ్యలో ఆర్పీపై నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు రావడంతో దుర్వినియోగం జరిగిన డబ్బును రాబట్టాల్సిన సీవో ఆ పనిచేయకుండా కొత్త ఆర్పీని నియమించినట్లు సమాచారం. ఇలా చెప్పుకొంటూ పోతే ఆర్పీల దారుణాలు కోకొల్లలుగా వెలుగు చూస్తున్నాయి. పట్టణంలో 94 సమాఖ్యల లెక్కాపద్దులు చూసేందుకు 94 మంది ఆర్పీలను నియమించారు. వీరిలో సగానికి సగం మంది ఆర్పీలు పొదుపు, రుణాల సొమ్ములు దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సమాఖ్యలను పర్యవేక్షిస్తున్న ఐదుగురు సీవోల్లో ముగ్గురు ఆర్పీలతో కలిసి చేతివాటానికి పాల్పడుతున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.



నిధుల కోసమే ఏర్పాటు చేసిన తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు

విలాసం ఖరీదు రూ.20 లక్షలు

ప్రభుత్వం నిధులు వృథా


వృథాగా మారిన షటిల్ కోర్టు


షటిల్ కోర్టుకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, సీసీ కెమెరా

చూడచక్కని షటిల్ కోర్టు.. చుట్టూ జాలి ఫినిషింగ్, సీసీ కెమెరాలు, బోరు, విద్యుత్తు శాఖ నుంచి నియంత్రిక తదితర వసతులను చూసి ఇదేదో సామాన్యుల కోసం ఏర్పాటు చేసిన వసతులనుకున్నారా.. అయితే మీరు పొరబడినట్టే.. వివరాల్లోకి వెళ్తే.. రెండేళ్ల క్రితం నాగర్‌కర్నూల్‌లో పనిచేసిన కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆట విడుపు కోసం కలెక్టరేట్‌కు సమీపంలో ఏర్పాటు చేసుకున్న క్రీడా మైదానం. పురపాలక సంఘంతో పాటు వివిధ శాఖల నుంచి దాదాపు రూ.20 లక్షలు సమీకరించారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం పేరుతో షటిల్ కోర్టును ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ క్రీడా ప్రాంగణం బోర్డు కూడా పెట్టారండోయ్.. అందులో ఆ ఇద్దరు జిల్లా అధికారులు మాత్రమే షటిల్ ఆడుకునేవారు. ఇతరులను అందులోకి అనుమతించలేదు. వారు బదిలీపై వెళ్లిన తర్వాత వినియోగించే వారు లేక పెట్టిన ఖర్చంతా వృథా అయింది. షటిల్‌కోర్టులో పిచ్చి మొక్కలు పెరుగుతుండటంతో ప్రభుత్వ నిధులు బూడిదలో పోసినట్లుగా మారిందని అందరికీ అందుబాటులోకి తెస్తే ప్రయోజకరంగా ఉంటుందని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్

చిట్టి చేతులు.. చక్కని కవితలు


విద్యార్థులకు కవితల గురించి బోధిస్తున్న ఉపాధ్యాయుడు తగుళ్ల గోపాల్

న్యూస్‌టుడే, కల్వకుర్తి న్యూటౌన్

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఏకంగా తెలుగు కవితలు రాసి ఔరా అనిపించారు. తెలుగు ఉపాధ్యాయుడు, కవి తగుళ్ల గోపాల్ ప్రోత్సాహంతో దేవగన్నేరు పేరిట కవితల పుస్తకం ముద్రించడం ఆదర్శనీయం. తెలుగు ఉపాధ్యాయుడి మార్గదర్శనంలో చదువుతోపాటు కవితలు రాయడంలో విద్యార్థులు రాణిస్తున్నారు. 86 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో 3వ తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులు 47 మంది సుమారు 60 కవితలు రాయడం విశేషం. 2012 నుంచి తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోపాల్‌లో ప్రతి విద్యార్థి ఏడో తరగతి వరకు వంద పద్యాలు తప్పనిసరి నేర్చుకొని పట్టు సాధించేలా తర్ఫీదునిచ్చారు. తను కవితలు రాస్తూనే విద్యా బుద్ధులతో పాటు కవితలు రాయించాలనే సదుద్దేశంతో ప్రార్థన, సమయ సందర్భాన్ని బట్టి రాసే విధానాన్ని అలవర్చారు. ఇతర విద్యాసంస్థల విద్యార్థులు రాసే కవితలను చదివి విన్పించేవారు. ఆయా పదాలకు అర్థాలు వివరించడం, అర్థవంతమైన పదాలను వినియోగిస్తూ కవితలను ఎలా రాయలో నేర్పించారు. ఆ పల్లె విద్యార్థులు అమ్మతనం, ఊరు, అన్నదాత, స్నేహం, ఆడపిల్ల పుట్టికతో పాటు వివక్షత, వనలపై విద్యార్థులు రచించిన కవితలతో దేవగన్నేరు కవిత సంకలనం ముద్రించి ఆవిష్కరించారు. ఆయా కవితలు ప్రతి ఒక్కరిని కంటతడి పెట్టించడంతో పాటు ఆలోచింప జేస్తున్నాయి. గోపాల్ సార్‌కు తెలుగు విభాగంలో 2021 సంవత్సరానికి దండకడియం అనే కవిత సంపుటిని రాసి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం దక్కించుకున్నారు. తెలుగు ఉపాధ్యాయుడు గోపాల్‌తో పాటు హెచ్‌ఎం డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు ఆలువేలు, వనతి, శ్రీనువాసులు, జంగయ్య విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు.


వారంతా పల్లె విద్యార్థులే. తెలుగు ఉపాధ్యాయుడి మార్గదర్శనంలో పదాలతో అల్లుకుపోయారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులే అయినా.. భావాత్మకంగా అర్థవంతమైన కవితలు రాసి ఆదర్శంగా నిలిచారు. పుస్తకంగా ముద్రించి ఔరా అనిపించారు.



విద్యార్థులు ప్రచురించిన దేవగన్నేరు కవితల పుస్తకం


కవితలపై ఆసక్తి పెంచుకొని..: చిన్నప్పటి నుంచి చదవడం, రాయడం అంటే ఇష్టం. ఉపాధ్యాయులు చదువుతో పాటు కవితలు రాయడాన్ని నేర్పిస్తున్నారు. తోటి విద్యార్థులతో పోటీ పడి నేర్చుకుంటు రాస్తున్నాను. ఇంకా చాలా కవితలు రాయాలని ఉంది. ఏదో తరగతిలో పద్యాలు, కవితలు రాయడం మొదలు పెట్టా.. ఉపాధ్యాయుడు గోపాల్ ప్రోత్సహంతో కవితలు రాశా.

- గునగంటి ఈక్షిత, 7వ తరగతి


తెలుగు పద్యాలంటే ఇష్టం..: తెలుగు పద్యాలు నేర్చుకోవాలని మా ఉపాధ్యాయులు చెప్పారు. పద్యాల సాధనతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇష్టంతో నేర్చుకుంటూ కవితలు రాస్తున్నాను. మరిన్ని కవితలను రాసి గుర్తింపు తెచ్చుకుంటా. పాఠశాల అటెండర్ ఖాసీం తాతపై రాసిన కవిత అంటే నాకు చాలా ఇష్టం.

- గోరంట్ల రాధిక, 5వ తరగతి


మాతృభాషపై మమకారం..: ఇప్పటికే 40 పద్యాలతో పాటు పాటలు నేర్చుకున్నాను. మరిన్ని నేర్చుకోవాలని ఉంది, మాఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నేర్పించారు. చదువుతో పాటు పద్యాలు నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగింది. ప్రతి రోజు సాధన చేసే వాళ్లం. పోటీ పడి కవితలను రాస్తున్నాం

- కల్మొండ యోగీశ్వర్, 7వ తరగతి


కవితలు రాయాలనే తపన పెరిగింది..: తెలుగు ఉపాధ్యాయుడు కవితలు రాసేందుకు ప్రతి రోజు సాధన చేయించేవాడు. ఉపాధ్యాయుడు రోజు చెబుతు, రాయిస్తూ, పాడిస్తూండటంతో రాయాలనే తపన పెరిగింది. ఒకరిని మించి ఒకరం కవితలు రాస్తూ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నాం. ఇప్పటికి పది కవితలు రాయడం జరిగింది.

- కాలె జశ్వంత్, 6వ తరగతి


వెంకటయ్య, చిట్టెమ్మ నివాసం ఉంటున్న వంటగది


ఇరుకు గదిలో వంట చేస్తున్న చిట్టెమ్మ

కరవైన నీడ.. కనికరం చూపరాదా!

పదిహేనేళ్లుగా ఓ కుటుంబం పాఠశాల వంటగదిలో నివాసముంటూ అష్టకష్టాలు పడుతున్న దైన్యమిది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం భట్టుపల్లి గ్రామానికి చెందిన తోకల వెంకటయ్య ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చాలా ఏళ్లుగా స్వీపర్‌గా పనిచేస్తున్నారు. అతడి భార్య చిట్టెమ్మ మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పనిచేస్తున్నారు. వీరికి గ్రామంలో ఉన్న ఇల్లు 2006లో కురిసిన వానలకు కూలిపోయింది. మళ్లీ ఇల్లు నిర్మించుకునే స్థోమత లేకపోవటంతో 2009 వరకు గ్రామంలో తెలిసిన వారి ఇళ్లల్లో తలదాచుకుంటూ వచ్చారు. ఆ తర్వాత గ్రామ పెద్దల అనుమతితో పాఠశాలలోని వంట గదిలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. 9 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పు ఉండే ఆ ఇరుకు గదిలోనే పదిహేనేళ్లుగా నెట్టుకువస్తున్నారు. సంతానం లేకపోవడంతో చిట్టెమ్మ తమ్ముడి కుమార్తెని దత్తత తీసుకున్నారు. ఆ అమ్మాయి ప్రస్తుతం ఆరో తరగతి చదువుతోంది. ఆ గదిలో వారిద్దరు ఉండటమే కష్టం కావటంతో అమ్మాయిని బంధువుల ఇంటి వద్ద ఉంచి చదివిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొందరికి రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేసినా వీరికి ఇవ్వలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా కనికరించి ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

- ఈనాడు, మహబూబ్‌నగర్

కృష్ణా తీరంలో ఘర్షణ!

ఆదాయం విషయంలో ఇరు రాష్ట్రాల బోట్ల నిర్వాహకుల మధ్య గొడవలు


సోమశిల వద్ద బోట్లపై వెళ్తున్న ప్రజలు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కృష్ణా తీరంలో తెలుగు రాష్ట్రాల బోట్ల నిర్వాహకుల మధ్య తరచూ గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ప్రధానంగా ఉభయ రాష్ట్రాల పరిధిలో రాకపోకల కోసం ప్రత్యేకంగా ఘాట్‌లు ఏర్పాటు చేశారు. అందులో సభ్యత్వం ఉన్నవారే బోట్లను నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు. అయితే తెలంగాణ నుంచి ఏపీకి రాకపోకలు ఎక్కువ.. ఏపీ నుంచి తెలంగాణకు తక్కువగా ఉండటంతో సమస్య తలెత్తుతోంది. తెలంగాణ బోటు నిర్వాహకులే అధిక ఆదాయం ఆర్జిస్తున్నారని ఏపీ వారి అభిప్రాయం. దీంతో ఇరు ప్రాంతాల మధ్య నిత్యం గొడవలు చోటుచేసుకోవడం, కేసుల నమోదు కావడం జరుగుతోంది.

ఇక్కడ ఘాట్‌లు...: శ్రీశైలం జల విద్యుత్తు ప్రాజెక్టు నిర్మాణంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో అమరగిరి, సోమశిల, మంచాలకట్ట, మల్లేశ్వరం, జటప్రోల్, చిన్నంబావి మండలంలోని చెల్లెపాడు, పెద్దమారూర్, యాపర్ల, అలంపూర్ తీరంలోని గొంది మల్ల గ్రామాల్లో మరపడవలపై నది దాటించడానికి ఘాట్‌లు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జానాల, సిద్ధేశ్వరం, సంగమేశ్వరం, కొండపాటూరు, తదితర ప్రాంతాల్లో ఘాట్‌లు ఉన్నాయి.

సమస్య ఇలా...: ప్రస్తుతం నది దాటించడానికి ఒక వ్యక్తికి రూ.50 నుంచి రూ.100 వరకు, ద్విచక్రవాహనానికి రూ.100 వరకు వసూళ్లు చేస్తున్నారు. దీంతో ఘాట్‌లో సభ్యత్వం ఉన్నవారు నెలకు రూ.వేలలో ఆర్జిస్తున్నారు. ఒక సోమశిల ఘాట్‌కే ఏడాదికి రూ.60లక్షల నుంచి రూ.80లక్షల వరకు ఆదాయం వస్తుండటం గమనార్హం. దీంతో ఒక ప్రాంతానికే ఆదాయం ఎక్కువగా వస్తోందని ఆరోపణలు, ఫిర్యాదులు చేసుకుంటున్నాయి.

త్వరగా వంతెన నిర్మించాలి...: ఇటీవలే సోమశిల, సిద్ధేశ్వరం ప్రాంతాల ఘాట్‌ల నిర్వాహకులు ఫిర్యాదులు చేసుకున్నారు. ఇప్పటికే నదిలో చేపల వేట విషయంలో, నీటి మట్టం తగ్గిన తర్వాత వేసవిలో ముంపు భూముల్లో పంట సాగుపై ఇరు ప్రాంతాల మధ్య ఘర్షణ తలెత్తుతోంది. త్వరగా వంతెన నిర్మాణం చేసి రాకపోకల సమస్య తీర్చాలంటూ ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు రాగానే పనులు..

సోమశిల వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడుతాం.

- రాజేందర్, ఈఈ, జాతీయ రహదారుల సంస్థ

ధ్రువపత్రాల జారీలో జాప్యంపై యువతి నిరసన

మానవపాడు, న్యూస్‌టుడే : ధ్రువపత్రాలు జారీ చేయకుండా జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ యువతి నిరసనకు దిగిన ఘటన మానవపాడు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మానవపాడు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన హైమావతి నాన్ క్రీమిలేయర్, ఓబీసీ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ ధ్రువపత్రాలు తీసుకోవడానికి సోమవారం ఉదయం 9 గంటల సమయంలో హైమావతి తండ్రితో కలిసి స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లిన తహసీల్దారు వహిదా ఖాతూన్ అక్కడి పని పూర్తయ్యాక మధ్యాహ్నం మండల రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటికే కార్యాలయం వద్ద నిరీక్షిస్తూ విసుగు చెందిన హైమావతి, ఆమె తండ్రి ధ్రువపత్రాల జారీలో ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దారును నిలదీశారు. కొద్ది రోజులుగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారంటూ కార్యాలయ ఉద్యోగులపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాఫ్‌నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవడానికి సమయం దగ్గర పడుతోందని, దరఖాస్తుకు ధ్రువపత్రాలు జతపరచాల్సి ఉండగా సంతకాలు పెట్టకుండా తహసీల్దారు జాప్యం చేశారని ఆరోపిస్తూ హైమావతి గట్టిగా కేకలు వేస్తూ కన్నీటిపర్యంతమయ్యారు. ఏదో గొడవ జరుగుతోందని చుట్టుపక్కల వారు కార్యాలయం వద్దకు వచ్చి గుమిగూడారు. చివరకు తహసీల్దారు ధ్రువపత్రాలపై సంతకం పెట్టడంతో సమస్య సద్దుమణిగింది. తహసీల్దారుని 'న్యూస్‌టుడే' సంప్రదించగా నాన్ క్రీమిలేయర్ ధ్రువపత్రం ఒక్క రోజులో ఇవ్వడం సాధ్యం కాదని, ఆర్ఐ క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇస్తే దాన్ని బట్టి జారీ చేస్తామని తెలిపారు. హైమావతి పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఒక్క రోజులోనే ధ్రువపత్రాలు జారీ చేశామని, తాను జాప్యం చేశానని ఆరోపించటం తగదని పేర్కొన్నారు.


యువతితో మాట్లాడుతున్న తహసీల్దారు వహిదా ఖాతూన్

అద్దె చెల్లించలేదని వసతి గృహానికి తాళం

వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే : వనపర్తిలోని బీసీ బాలికల కళాశాల వసతి గృహం అద్దె చెల్లించలేదని మంగళవారం భవనం యజమాని రామకృష్ణ గేట్‌కు తాళం వేశారు. అందులో పని చేసే సిబ్బంది, వార్డెన్ రంజిత బయటే ఉండిపోయారు. వసతి గృహంలో 308 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. దసరా సెలవులు ఇవ్వడంతో వారు సొంతూళ్లకు వెళ్లిపోయారు. మంగళవారం ఇద్దరు అమ్మాయిలు వచ్చి తాళం వేసి ఉండటాన్ని చూసి వెనక్కి వెళ్లిపోయారు. 21 నెలల నుంచి అద్దె బకాయి ఉందని, దాదాపు రూ.పది లక్షల పైగా రావాల్సి ఉందని భవన యజమాని తెలిపారు. ఈ విషయమై జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి బీరం సుబ్బారెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా అద్దె సమస్య గురించి ప్రతినెల ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని తెలిపారు. సమస్య జేసీ దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు.



గేటుకు తాళం వేయడంతో బయట ఉన్న వసతి గృహ సిబ్బంది

కేఎల్ఐ కాలువలో పడి రైతు మృతి

బిజినేపల్లి, న్యూస్‌టుడే : కేఎల్ఐ కాలువలో ఏర్పాటుచేసిన వ్యవసాయ బోరు మోటారుకు మరమ్మతులు చేస్తున్న రైతు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందిన సంఘటన బిజినేపల్లి మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి గ్రామానికి చెందిన వెంకటస్వామి (48) తన పొలం వద్ద కేఎల్ఐ కాలువలో ఏర్పాటు చేసిన బోరు మోటారులో ఇరుక్కున్న నాచు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడి పోయాడు. నీటిలో మునుగుతుండగా పక్క పొలంలోని రైతులు కాపాడే యత్నం చేసినప్పటికీ ప్రవాహం అధికంగా ఉండటంతో ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రెస్క్యూ టీం గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. వెంకటస్వామికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి కళోత్సవం

ఆరు అంశాల్లో పోటీల నిర్వహణ


బల్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అచ్చంపేట, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేయనున్నారు. సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో వివిధ కళల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో రెండు రోజుల పాటు జిల్లా స్థాయిలో కళా ఉత్సవ్ పేరుతో పోటీలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఇవీ పోటీలు నిర్వహించే అంశాలు : విద్యాశాఖ ఆధ్వర్యంలో అధికారులు విద్యార్థులకు ఆరు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. నృత్యం, వోకల్ మ్యూజిక్, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, సంప్రదాయ కథలు చెప్పడం, థియేటర్, విజువల్ ఆర్ట్స్ అనే అంశాల్లో పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో 9, 10 తరగతులు, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటి జాతీయ స్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు. ఈ పోటీల్లో ఒక్కో విద్యా సంస్థ నుంచి ఒక్కో విభాగంలో ఒకరు నుంచి ఐదు మంది విద్యార్థులు విజువల్ ఆర్ట్స్‌లో ఒక విద్యార్థి, సంప్రదాయ కథలు చెప్పె పోటీలో ఒక్కో విద్యా సంస్థ నుంచి ఇద్దరు విద్యార్థులు పాల్గొన వచ్చు. పాల్గొనేందుకు అనుమతిస్తారు. విద్యాశాఖ అధికారులు పోటీల సమాచారాన్ని అన్ని పాఠశాలలు, కళాశాలలకు పంపించారు. ఈ నెల 16, 17 తేదీల్లో జిల్లా, నవంబరు 1, 2 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహం

కళా ఉత్సవ్ పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులకు సమాచారం ఇచ్చి ప్రోత్సహించేలా అన్ని యాజమాన్యాల పరిధిలోని విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు, ప్రధానాచార్యులకు సమాచారం అందించాం. ఆసక్తి ఉన్న విద్యార్థులను గుర్తించి పోటీల్లో పాల్గొనేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించాం. ఈ నెల 16, 17 తేదీల్లో నాగర్‌కర్నూలులోని జాతీయోన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నాం. ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా విద్యా సంస్థల అధిపతులు శ్రద్ధ తీసుకోవాలి.

- డా.గోవిందరాజులు, డీఈవో, నాగర్‌కర్నూలు

ఉమ్మడి జిల్లాలో ఉన్నత పాఠశాలలు	జూనియర్ కళాశాలలు	విద్యార్థులు
1,008	86	67,893

వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయండి



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ డాక్టర్లు, మద్దతు తెలిపిన వైద్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిని హత్యాచారానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని జూనియర్ డాక్టర్ల(జూడాల) సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఒక రోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి అక్కడి వైద్య విద్యార్థులు, వారి ప్రతినిధులతో చర్చలు జరిపినా కేసులో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవటం శోచనీయమన్నారు. నేతలు అభిలాష్, అభిషేక్, కావ్య, ఐఎంఏ నాయకులు డా.బాల శ్రీనివాస్, డా.సునీల్, డా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలో కొత్త కోర్సులు

పాలమూరు : మహబూబ్‌నగర్ పట్టణం పిల్లలమర్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. మ్యానుఫ్యాక్చరింగ్ కంట్రోల్ ఆటోమేషన్(ఏడాది కాల వ్యవధి), ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్(ఏడాది కాల వ్యవధి), ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్ మెకానికల్(ఏడాది కాల వ్యవధి), బేసిక్ డిజైనర్ వర్చువల్ వెరిఫైర్ మెకానికల్(రెండేళ్లు), అడ్వాన్స్ సీఎన్‌సీ టెక్నీషియన్(రెండేళ్లు), మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్(రెండేళ్లు) తదితరాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు iti.telangana.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 83742 50330 నంబరులో సంప్రదించాలని సూచించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	126-00
రిటైల్	148-00
డ్రెస్డ్	215-00
స్కిన్‌లెస్	244-00

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

మహబూబ్‌నగర్ : 9948145978 జడ్చర్ల : 8008573899
దేవరకద్ర : 9000031648 భూత్పూర్ : 8008563143



సమస్య : మిడ్జిల్ - కల్వకుర్తి రోడ్డు పక్కన గ్రామంలో సేకరించిన చెత్తను వేయడంతో తీవ్ర దుర్వాసన వస్తోంది. మేకలు, గొర్రెలు చెత్త తిని చనిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

– ఆంజనేయులు, మిడ్జిల్

సమాధానం : క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. మరోమారు రోడ్డు పక్కన చెత్తను వేయకుండా కార్యదర్శికి ఆదేశాలు జారీ చేస్తాం.

– జగదీశ్, ఎంపీవో, మిడ్జిల్

- న్యూస్‌టుడే, జడ్చర్ల న్యూటౌన్

ఇంత జరిగే వరకు ఏం చేశారు?

మహిళా సంఘాల్లో అక్రమాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : కోయనగర్ మహిళా సంఘాల సమాఖ్యలో నిధులు, రుణాల దుర్వినియోగంపై ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పురపాలికకు చేరుకున్న ఎమ్మెల్యే.. కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఛాంబర్‌లో మెప్మా డీఎంసీ, సీవోలతో రెండు గంటల పాటు కోయనగర్ సమాఖ్యలో ఆర్పీ చేసిన అక్రమాలపై చర్చించారు. ఒక ఆర్పీ ఇంత పెద్ద మొత్తంలో పొదుపు సొమ్ము, రుణాల వాయిదాల డబ్బు దుర్వినియోగం చేస్తుంటే మీరంతా ఏం చేశారని సీవోలను నిలదీశారు. సంబంధిత సీవో ఎవరని ఆరా తీసి మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. తన ప్రమేయం లేదని, బ్యాంకరుతో ఆర్పీ కుమ్మక్కై పెద్ద మొత్తంలో దుర్వినియోగానికి పాల్పడ్డారని, తనకు తెలిశాక సమాఖ్యలోని కొంత మంది సభ్యుల డబ్బు రికవరీ చేయించానని సీవో వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. లెక్కాపద్దులు చూసే ఆర్పీలు అక్రమాలకు పాల్పడితే మహిళలు నమ్మకం కోల్పోతారని, స్వయం సహాయక సంఘాల మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని పేర్కొన్నారు. ప్రజల సొమ్ము దుర్వినియోగం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు. మహిళా సంఘాల ఖాతాలు పర్యవేక్షించే ఆర్పీలు ఎంత మంది ఉంటారని ఎమ్మెల్యే ఆరాతీయగా తమ పరిధిలోనూ అక్రమాలకు పాల్పడుతున్న కొందరు ఉన్నారని సీవోలు వివరించడం గమనార్హం. రూ.కోట్లలో మహిళల సొమ్ము ఖాజేసిన ఆర్పీ నుంచి ఎలా రికవరీ చేయాలో మీరే చెప్పాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఇలాంటి అక్రమాలు జరిగితే బ్యాంకర్లు ముందు రుణాలు ఇవ్వడం మానేస్తారని ఆందోళన వ్యక్తంచేశారు. మరోమారు అక్రమాలు జరగకుండా పర్యవేక్షణ పెంచాలని, చాలా రోజులుగా పనిచేస్తున్న ఆర్పీలను మార్చేసి వారి స్థానంలో కొత్త వారిని నియమించాలని ఎమ్మెల్యే సీవోలకు సూచించారు. చట్టం ప్రకారం ముందుకెళ్లి కోయనగర్ సమాఖ్య ఆర్పీ నుంచి మహిళల సొమ్ము రికవరీ చేయాలని కమిషనర్ మహేశ్వర్‌రెడ్డికి సూచించారు.



సీవోలతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి


పత్తా లేని కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీ!

పాలమూరు పురపాలకం, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్ పట్టణం కోయనగర్ స్వయం సహాయక సంఘాల సమాఖ్యలో పెద్ద మొత్తంలో మహిళల సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన ఆర్పీ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. నాలుగు రోజులుగా కోయనగర్‌లోని ఆమె ఇంటికి తాళం ఉండటంతో ఆ ప్రాంత సంఘాల మహిళలు ఆందోళన చెందుతున్నారు. తమ సొమ్ము ఏం చేశావని నిలదీసేందుకు వెళ్తున్న మహిళలు ఆర్పీ ఇల్లు మూసి ఉండటం చూసి నివ్వెరపోతున్నారు. కొందరు ఆ వార్డు కౌన్సిలర్ ఇంటికి వెళ్లి ఆర్పీ కుటుంబంపై ఆరా తీస్తున్నారు. మూడేళ్ల క్రితం పాల్‌సాబ్‌గుట్ట సూర్యోదయ సమాఖ్య ఆర్పీ కూడా ఇలాగే మహిళల పొదుపు సొమ్ము, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల డబ్బు కాజేయడంతో విచారణ జరిపారు. పెద్ద మొత్తంగా రికవరీ చేయాలని ఆదేశించటంతో రాత్రికి రాత్రే ఆ ఆర్పీ పాలమూరును వదిలి వెళ్లారు. ఇప్పటికీ పాల్‌సాబ్‌గుట్ట ఆర్పీ చేసిన దుర్వినియోగం తాలూకు సొమ్ము రికవరీ చేయకపోవడంతో సూర్యోదయ సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల మహిళలు భారీగా నష్టపోయారు. అప్పట్లో మెప్మాకు ఇన్‌ఛార్జిగా పని చేసిన అధికారి ఆర్పీపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇదిలా ఉంటే కోయనగర్ సమాఖ్యలో జరిగిన అక్రమాలపై మెప్మా సిబ్బంది మంగళవారం వారి కార్యాలయంలో తుది దశ లెక్కాపద్దులు పరిశీలించారు. స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, స్వయం సహాయక సంఘాల వ్యక్తిగత ఖాతాల వారీగా తనిఖీలు చేయగా రూ.1.49 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు గుర్తించారు. పూర్తిస్థాయి నివేదిక బుధవారం రూపొందించి పురపాలక కమిషనర్‌కు అందజేస్తామని డీఎంసీ తెలిపారు.

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండలంలోని చొక్కంపేటకు చెందిన రైతు మంచాల మల్లేష్ పొలంలో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయని గత నెల 30న ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా' లో కథనం ప్రచురితం అయింది. దీంతో విద్యుత్తు శాఖ ఏఈ సుజాత స్పందించి నూతన స్తంభం ఏర్పాటు చేయించి తీగలను సరిచేశారు.

స్పందనకు వందనం



వేలాడుతున్న తీగల వద్ద ఏర్పాటు చేసిన స్తంభం

మగ్గం అల్లికలపై శిక్షణ

బాలానగర్, న్యూస్‌టుడే: మహిళలకు మగ్గం అల్లికలపై ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సత్తయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సహకారంతో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 19 నుంచి 40 సంవత్సరాలలోపు మహిళలందరికీ మండల కేంద్రంలో మగ్గం వర్క్ నేర్పించనున్నట్లు తెలిపారు. శిక్షణలో ఉచిత మధ్యాహ్న భోజనం వసతి ఉంటుందని, శిక్షణ పూర్తయినా తర్వాత సర్టిఫికెట్‌తో పాటు మగ్గం వేసిన బ్లౌజ్ ఒకటి ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం4.30 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9949104515 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా పక్వాడా



చెత్త సేకరిస్తున్న రైల్వే సిబ్బంది

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : స్వచ్ఛతా పక్వాడా (శుభ్రత పక్షం) పురస్కరించుకుని రైల్వే స్టేషన్‌లో మంగళవారం పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టారు. మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో పరిసరాలను పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటారు. మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ సంరక్షించాలని రైల్వే అధికారులు కోరారు. స్టేషన్ సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

శ్రీనివాస - విశ్వం, తిరుమల - వెట్టయాన్
బాలాజీ - జనక అయితే గనక, వెంకటేశ్వర - దేవర
వెంకటాద్రి - మా నాన్న సూపర్ హీరో, మైత్రి శ్రీకృష్ణ - మార్టిన్
- న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ పట్టణం

భూగర్భ డ్రైనేజీ నిర్మించరూ..!

రాజాపూర్, న్యూస్‌టుడే: రాజాపూర్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి వెళ్లే దారిలో కొద్ది నెలల క్రితం అండర్ డ్రైనేజీ నిర్మిస్తామని అధికారులు కాలువ తీసి వదిలేశారు. మురుగునీరు చేరి పరిసర ప్రాంతాల్లో దోమలు బెడదతో అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువ తీసి పైపులు సీసీ రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా వదిలేయడంతో పీహెచ్‌సీ, తిర్మలాపూర్‌కి వెళ్లే వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే కాలువలో 4 నెలల క్రితం ప్రమాదవశాత్తు రెండేళ్ల బాలుడు జశ్వంత్ ఆడుకుంటూ వెళ్లి గుంతలో పడి ప్రాణాలు వదిలాడు. సోమవారం జరిగిన ప్రజావాణిలో యువకులు అండర్ డ్రైనేజీ నిర్మించాలని ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



డ్రైనేజీ నిర్మాణం కోసం తీసిన కాలువలో మురుగు నీరు

ముడా ఛైర్మన్‌కు సన్మానం

పాలమూరు, న్యూస్‌టుడే: మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధి సంస్థ (ముడా) ఛైర్మన్‌గా నియామకమైన కాంగ్రెస్ నేత లక్ష్మణ్‌యాదవ్ డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తన నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. అనంతరం లక్ష్మణ్‌యాదవ్ జీఎంఆర్ దంపతులకు జ్ఞాపికను అందించారు. త్వరలో జరిగే ప్రమాణస్వీకారానికి హాజరు కావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మల్లు నరసింహారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్‌ఖాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న నూతన ముడా ఛైర్మన్ లక్ష్మణ్‌యాదవ్ తదితరులు

నీట్ విద్యార్థినికి ఆర్థిక సాయం

జడ్చర్ల: నీట్ పరీక్షలో అర్హత సాధించి, ఎంబీబీఎస్ చదువు కోసం వెళుతున్న నిరుపేద విద్యార్థినికి మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ ఆర్థిక సహాయం అందజేశారు. బాలానగర్ మండలం తిరుమలగిరి గ్రామానికి చెందిన సి.దివ్యకు మంగళవారం రూ.20వేల ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు.

పశు సంపదను కాపాడండి : ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : వ్యాధుల నివారణతో పశు సంపదను కాపాడాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం వీరన్నపేట పశు వైద్య కేంద్రంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల వైద్య శిబిరానికి ఆయన హాజరై రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు వేయించుకోవాలన్నారు. గ్రామాలకు వస్తున్న వైద్యాధికారులకు సహకరించాలన్నారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వచ్చే నెల 14 వరకు టీకాలను ఉచితంగా అధికారులు వేస్తారని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, పురపాలిక వైస్ ఛైర్మన్ షబ్బీర్ హమ్మద్, మార్కెట్ వైస్ ఛైర్మన్ విజయ్‌కుమార్, గొర్రెల మేకల పెంపకందారుల సహకార సంఘం ఛైర్మన్ శాంతన్న, కౌన్సిలర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

నవాబ్‌పేట, న్యూస్‌టుడే : రైతుల సదుపాయం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహులు కోరారు. మంగళవారం రుద్రారం గ్రామంలోని రైతువేదికలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ 2,320, బీ గ్రేడ్ రూ. 2,300 ధర చెల్లిస్తున్నట్లు చెప్పారు. సన్న రకం వడ్లకు క్వింటాళుకు రూ.500 బోనస్ అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏవో కృష్ణకిశోర్, పీఏసీఎస్ సెక్రటరీ హనుమంతు, డైరెక్టర్లు శశిధర్‌రెడ్డి, అంజయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, నర్సిరెడ్డి, బంగ్ల రవి, రవీందర్‌గౌడ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహులు

'విగ్రహం ధ్వంసం వెనక కుట్ర'

మహబూబ్‌నగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లోని దేవాలయాల్లో విగ్రహాల ధ్వంసం వెనక భారీ కుట్ర దాగి ఉందని వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆరోపించారు. రాష్ట్రంలో మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం సంతోష్‌నగర్‌లోని అమ్మవారి దేవాలయాన్ని ఇద్దరు ఆగంతకులు ధ్వంసం చేసినా పోలీసులు వారిని మతిస్థిమితం లేనివారంటూ కేసును బలహీనపరిచారని మండిపడ్డారు. ఇటీవల సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసినా ఇంతవరకు దుండగులను గుర్తించి చర్యలు తీసుకోలేదన్నారు. దేవాలయాలపై దాడులను ఆపకుంటే వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.

బదిలీపై వెళ్లిన అధికారులకు సన్మానం

రాజాపూర్, న్యూస్‌టుడే : రాజాపూర్‌లోని విద్యుత్తుశాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏడీఈ తావ్ర్యానాయక్ మహబూబ్‌నగర్ టౌన్‌కు, డివిజన్ సబ్‌ఇంజినీర్ శాలమ్మ జడ్చర్లకు బదిలీపై వెళ్లడంతో మంగళవారం రాజాపూర్, బాలానగర్, నవాబ్‌పేటకు చెందిన ఆశాఖ అధికారులు, సిబ్బంది శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఈలు సుజాత, సంతోష్, చంద్రశేఖర్, ఎల్ఐలు సోమేష్ కుమార్, హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీ అధికారులను సన్మానిస్తున్న సిబ్బంది

వాల్మీకి జయంతికి ఏర్పాట్లు

మహబూబ్‌నగర్ సాంస్కృతికం : జిల్లాకేంద్రం కొత్తగంజిలో వెలసిన వాల్మీకి దేవాలయంలో ఈనెల 17న జయంతి పూజలను ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్, వాల్మీకి ఉద్యోగుల సంఘం బాధ్యులు యుగంధర్‌నాయుడు, మద్దిగట్ల కృష్ణ తెలిపారు. ఆలయంలో తగు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. గురువారం ఆలయ సముదాయంలో దేవతామూర్తుల విగ్రహాలకు అభిషేకాలు, అనంతరం కుంకుమార్చన, అలంకరణోత్సవం ఉంటాయని, వాల్మీకిబోయలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

19న అండర్-14,17 ఎస్‌జీఎఫ్ కరాటే జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) అండర్-14,17 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లా విద్యార్థుల ఎంపికలను ఈనెల 19న డీఎస్ఏ మైదానంలో చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాల బోనఫైడ్, ఆధార్ నఖలుతో మైదానంలో ఉదయం 10గంటలకు నివేదించాలని పేర్కొన్నారు.

22న ఉమ్మడి జిల్లా అండర్-19 కబడ్డీ జట్ల..

మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల,బాలికల అండర్-19 కబడ్డీ జట్లను ఈనెల 22న డీఎస్ఏ మైదానంలో ఎంపికలు చేపడుతున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పాపిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కుల జాబితా, ఇంటర్ బోనఫైడ్‌తో మైదానంలో ఉదయం 9గంటలకు పీడీ రాజవర్ధన్ రెడ్డిని 98668 11816 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

మద్యపాన నిషేధంపై తీర్మానం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని నార్లొని కుంట్ల గ్రామంలో 5ఏళ్ల పాటు మద్యపాన నిషేధం అమలు చేస్తున్నట్లు గ్రామప్రజలు స్వచ్ఛందంగా తీర్మానం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో మద్యం విక్రయించడంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రజలు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విక్రయించిన వారికి జరిమానా విధిస్తున్న వారు తెలిపారు. ప్రజలందరూ సహకరించాలని కోరారు.



కౌకుంట్లలో కలాం విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. కౌకుంట్ల మండల కేంద్రంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

నవాబ్‌పేట : మరికల్ గ్రామ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి విద్యార్థి కృషి చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సర్వమంగళ, ఉపాధ్యాయులు సరస్వతి, మల్లప్ప, పాండురంగాచారి, వెంకటయ్య, శివప్రసాద్, రామకృష్ణ, శశిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.



నవాబ్‌పేట : మరికల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని జడ్చర్లలో మంగళవారం నిర్వహించారు. బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ సుకన్య, అధ్యాపకులు సదాశివయ్య, నందకిశోర్, మాధురి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 3వ వార్డులోని బీసీ గురుకులంలో కేక్ కోసి వేడుక నిర్వహించారు. కౌన్సిలర్ సతీష్, ప్రిన్సిపల్ రవి, ప్రకాశ్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ గ్రామీణం : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని జేపీఎన్‌సీఈ పాలిటెక్నిక్ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.పి.కృష్ణమూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డా.వీఈ చంద్రశేఖర్, ఆయా విభాగాధిపతులు, విద్యార్థులు కలామ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,269

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలు మంగళవారం నిర్వహించారు. క్వింటా గరిష్ఠ ధర రూ.2,269, మాదిరి ధర రూ.2,268, కనిష్ఠ ధర రూ.1,711 చొప్పున రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెండో పట్టణ ఠాణా సీఐ ఏజాజోద్దీన్ అన్నారు. ఈ మేరకు రెండో పట్టణ పరిధిలోని పలు దుకాణాలు, వర్తక వాణిజ్య సముదాయాలు, కార్ల అడ్డాల వద్ద పలువురు యువకులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. అంతర్జాలం ద్వారా చరవాణికి వచ్చే ఎలాంటి లింక్‌లను ఓపెన్ చేయొద్దని సూచించారు. ఎలాంటి సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి వివరాలను చెప్పాలన్నారు. అనంతరం సమీపంలో ఉన్న పోలీస్ ఠాణాను సంప్రదించాలన్నారు.



జిల్లా కేంద్రం న్యూటౌన్ సమీప పురపాలక షాపింగ్ కాంప్లెక్స్ వద్ద యువకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఏజాజోద్దీన్

పాలమూరు ఐటీఐ కళాశాల ఉన్నతీకరణకు చర్యలు

పాలమూరు, న్యూస్‌టుడే : మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలను టీసీఎస్ సౌజన్యంతో కలిసి ఉన్నతీకరించి విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 65 ఐటీఐలను ఉన్నతీకరించి అడ్వాన్స్ శిక్షణ కేంద్రాలుగా మారుస్తున్నట్లు తెలిపారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆరు కోర్సులు ప్రవేశ పెట్టబోతున్నట్లు వివరించారు. ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొత్త కోర్సులతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, రతన్ టాటా విగ్రహాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా రూ.15కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. హన్వాడ మండలంలోని గుడిమల్కాపూర్, టంకర, బుద్దారం గ్రామాల నుంచి నవాబ్‌పేట రహదారికి అనుసంధానం చేస్తూ రోడ్డును నిర్మిస్తామన్నారు. ప్రతి తండాకు రోడ్డు సదుపాయాన్ని కల్పిస్తామన్నారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ వికారాబాద్ సమీపంలోని దామగుండంలో రాడార్ కేంద్రాన్ని ప్రారంభిస్తుంటే భారాస నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మొదట ఈ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చింది భారాస ప్రభుత్వమే కదా అని ప్రశ్నించారు. కేటీఆర్ ఈరోజు మాట్లాడింది రేపు గుర్తుండదని ఎద్దేవా చేశారు. దేశ భద్రతకు అత్యంత కీలకమైన ఈ ప్రాజెక్టుపై భారాస నాయకులు చేస్తున్న విమర్శలు అర్థరహితమన్నారు. మార్కెట్ వైస్ ఛైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, నాయకులు ఎన్పీ వెంకటేశ్, మారేపల్లి సురేందర్‌రెడ్డి, చాంద్‌పాషా, లక్ష్మణ్ నాయక్, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంప్రియుల అడ్డాగా.. కళాశాల..!

జడ్చర్ల గ్రామీణం, న్యూస్‌టుడే: బాలానగర్ మండల కేంద్రంలోని మందుబాబులకు ప్రభుత్వ జూనియర్ కళాశాల అడ్డాగా మారింది. దసరా పండగ సెలవులు ఉండటంతో మందుబాబులు కళాశాలలోనే తాగిన సీసాలను వదిలేసివెళ్లారు. దీంతో మంగళవారం కళాశాలలు తెరవడంతో మొదటి రోజు సీసాలను చూసి విద్యార్థులు ఖంగుతిన్నారు. కళాశాలకు భద్రత సిబ్బంది లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. ప్రహరీ లేకపోవడంతో మందుబాబులు రెచ్చిపోతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అధ్యాపకులను 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బాలానగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట సీసాలు

అన్నదాతకు అండగా ఉంటాం

మిడ్జిల్, న్యూస్‌టుడే : పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి ప్రభుత్వపరంగా అన్నదాతకు అండగా ఉంటామని బాదేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ టి.జ్యోతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ అల్వాల్‌రెడ్డి, సీఈవో బాల్‌రెడ్డి, నాయకులు సాయిలు, గౌస్, భాస్కర్‌రెడ్డి, బంగారయ్య, సత్యంగౌడ్, రాజారెడ్డి, బీమయ్య పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ టి.జ్యోతి

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయండి

పాలమూరు, న్యూస్‌టుడే : బదిలీ అయినా జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రవీందర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఏడాది జులైలో ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారని, అందులో 400 మంది ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాల నుంచి ఇతర పాఠశాలలకు బదిలీకి దరఖాస్తు చేశారని చెప్పారు. వారికి కొత్త స్థానాలు కేటాయించినా మూడు నెలల నుంచి పాత పాఠశాలలోనే పని చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిని తక్షణమే బదిలీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టీపీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ, డీటీఎఫ్, తపస్, టీఎస్‌టీయూ నాయకులు వెంకటేశ్, శ్యామ్‌బాబు, సుధాకర్‌రెడ్డి, ఆదిత్య, శ్రీశైలం, సునీల్, బాబునాయుడు, మహమూద్ పాల్గొన్నారు.



డీఈవో రవీందర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కారు బోల్తాపడి ఒకరికి గాయాలు

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే: కారు బోల్తాపడి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని ముకర్లాబాద్ సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... కోస్గి నుంచి ప్రయాణికులతో మహబూబ్‌నగర్ వెళుతున్న కారు అదుపుతప్పి ముకర్లాబాద్ వంతెన దగ్గర బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఓవ్యక్తికి గాయాలైనట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భూత్పూర్ : భూత్పూర్ పుర పరిధిలోని నర్సింగాపూర్‌కు చెందిన అనుప కృష్ణయ్య వృద్ధుడిని సమీప దాయాదులు దూషించారు. దీంతో మనస్తాపానికి గురైన అతను వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఈ నెల 13న రాత్రి ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ సమీపంలో, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాహనదారుడికి జైలు శిక్ష, జరిమానా

దేవరకద్ర గ్రామీణం, న్యూస్‌టుడే : మద్యంతాగి ద్విచక్రవాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష, జరిమానా విధించినట్లు ఎస్సై నాగన్న తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం వెల్టూరు గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతుండగా తనిఖీ చేసి తాగినట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. మంగళవారం జిల్లా జడ్జి శశిధర్ మూడు రోజుల పాటు జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

PUBLIC NOTICE

This is to inform the general Public that my client **Sri Mohammed Soyab, S/o Yakub Hussain, R/o H.No. 2-8-76/77, Madina Masjid, Mahabubnagar town,** has entered into agreement with **Sri. D.Raghu Rama Raju, S/o D.Kamalakar Raju, aged 50 years, occ: business, R/o. H.No.4-3-55, Ram Nagar, Mahabubnagar Town** to purchase the below mentioned property and paid substantial amount towards part of sale consideration. **Sri.D.Raghu Rama Raju,** has purchased the said property from **K.Laxmi, W/o K.Prasad,** through Regd. Sale deed **Document No.5485/2024.** If anybody got any objection on said sale transaction or got any rights or claims over the said property, they may put forth their objections along with documentary evidence, within 7 days to below mentioned address. If no objections are received within said period, my Client will pay entire agreed sale consideration to **D.Raghu Rama Raju, S/o. D.Kamalakar Raju** and get the Sale Deed registered in his favour or in favour of his nominee by treating the said property free from litigation and encumbrances.

SCHEDULE OF PROPERTY

A shop bearing No.3-9-23, admeasuring 30.61 Sq. yards, consisting of two floors (Ground floor roof extent 275.00 Sq. feet, First floor,roof extent 275.00 Sq. feets and Second floor covered with Tin Sheet roof extent 176.00 Sq. feets) situated at Shah Bazar, Mahabubnagar town and District and bounded by **East:** House of Muthyalu, **West :** Shah Bazar Road, **North:** Shop No. 3-9-22, **South:** Shop No.3-9-24,
Date : **15-10-2024**

Sd/- **MOHAMMAD ARSHAD AYUB**
Advocate,
H.No.4-304, Bhoothpur, Mahabubnagar District
Pin-509382, Cell No.9966501486